# మబ్బులు

డా. చలసాని ఉషారాణి



"మీతోటి అధ్యాపకుడి గురించి మీరింతగా స్పందించడం నాకానందాన్నిస్తోంది. కానీ మీకో సంగతి చెప్పాలి. నేను భోజనానికి టైము లేక రాత్రి భోంచెయ్యలేదు. పని పూర్తి అయ్యేటప్పటికి రాత్రి ఒంటిగంటయ్యింది.

"జితేంద్రగారు వెళ్ళిపోయారు తెలుసా?" కృష్ణ అడిగాడు విజయ్‌ని.

"ఛ! నిజంగానా? అయ్యో! అలా జరిగివుండవలసింది కాదు" అన్నాడు విజయ్ చాలా బాధపడుతూ.

"అసలేం జరిగింది?" తన ఉత్సుకత ఆపుకోలేక అడిగాడు రాజీవ్.

"ఓ, మీరు నిన్న క్లాసుకు రాలేదు కదూ?! ఏమిటో అప్పుడప్పుడు అలా అనుకోనివి జరిగిపోతూ ఉంటాయి" కృష్ణ చాలా వేదాంతధోరణిలో అన్నాడు.

"అయ్యో! అసలేం జరిగిందో చెప్పండయ్యా బాబూ!" అన్నాడు రాజీవ్ అసహనంగా.

"ఇప్పుడు మనకి క్లాసులు జరుగుతున్నవి అధ్యాపకులుగా మనం పెరిగిన సబ్జెక్టులో మరింత జ్ఞానాన్ని పెంచుకోడానికే కదా?"

"అవునూ?"

"మనకి రిసోర్సు పర్సన్సుగా దేశవ్యాప్తంగా ఆచార్యులు వస్తున్నారు కదా!"

"కదా మరి?"

"వాళ్ళు చెప్పేది మనం వినాలి. అనుమానాలుంటే ప్రశ్నించాలి అని కదా మనం సంచాలకులు రామదేవ్ చెప్పింది?"

"అంతే చేస్తున్నాం కదా!"

"కానీ జితేంద్రగారు ప్రశ్నలు ఎక్కువ వేస్తున్నారనీ, క్లాసుని డిస్టర్బు చేస్తున్నారనీ కొందరు అభిప్రాయపడ్డారు"

"ఇంటరాక్షను ఉండాలని రామదేవ్ గారన్నారు కదా" రాజీవ్ అన్నాడు.

"అన్నారు. కానీ అవి ఆచార్యులని ఇరుకున పెట్టేవి కాకుండా, వారి తెలివిని ప్రశ్నించేవి కాకుండా ఉండాలట." కృష్ణ అన్నాడు.

"ప్రశ్న అంటేనే విజ్ఞానాన్ని తోడేది కదా?" విజయ్ అన్నాడు.

"బావిలో నీళ్ళు తోడటానికి ఖాళీ బక్కెట్టుతో రావాలి కదా మరి?" రాజీవ్ అన్నాడు.

"కానీ జితేంద్రగారి బక్కెట్టు నిండుగానే ఉంది మరి. ఆయన తన బక్కెట్టులో నీరు తియ్యగా ఉందో బావిలో నీరు తియ్యగా ఉందో పరీక్షించి మరీ తోడుకోదలిచారు" అన్నాడు కృష్ణ.

"అది తప్పంటావా?" రాజీవ్ అడిగాడు.

"తప్పా అంటే తప్పు కాదు. కానీ..."

"క్లాసుకు టైము అయింది వెళదాం రండి" అంటూ శర్మ పిలిచాడు.

రెండుగంటలపాటు లెక్చరు విన్న ఇరవైఐదుమంది అధ్యాపకులు అప్పుడే టైము అయిపోయిందా అనుకున్నారు.

"ఇంకో గంట ఉంది. ఈ సమయంలో మీరు ఆచార్యులని ప్రశ్నలడగవచ్చు" రామ్‌దేవ్‌గారన్నారు.

క్లాసంతా నిశ్శబ్దంగా ఉంది.

"మీరంతా ఎంతో అనుభవం గల అధ్యాపకులు. మీకు సబ్జెక్టుపై అనుమానాలు లేకపోవచ్చు. కానీ క్లాసన్న తరువాత ఇంటరాక్షను ఉంటే కానీ రక్తి కట్టదు. అందుకోసమైనా ప్రశ్నలడగండి" అన్నారు ఆచార్యులు.

మళ్ళీ నిశ్శబ్దం అలుముకుంది.

"మీరు నన్నేమీ ప్రశ్నించకపోతే మీకు అర్థమయ్యేలా నేను చెప్పలేదేమో అని నన్ను నేను శంకించుకోవాల్సి ఉంటుంది" అన్నారు ఆచార్యులు.

తర్వాత కూడా నిశ్శబ్దమే....

"మరైతే ఈ పూటకి ఈ క్లాసు అయిపోయినట్టే" అంటూ ఆచార్యులు లేచారు. వారిని సాగనంపి వచ్చారు రామ్‌దేవ్.

"మీరంతా ఎందుకు ఇంత మౌనంగా ఉన్నారో నాకు తెలుసు. జితేంద్రగారు ఈ రోజు క్లాసులో లేకపోడం గమనించి నేను చాలా బాధపడ్డాను. నిన్న ఇద్దరం ఈ ప్రశ్నించడం విషయంలో ఘర్షణ పడకపోతే ఈ రోజు వచ్చేవారు కదా అని నేను చాలా ఫీలవుతున్నాను. నా మూలంగా ఆయన ఈ రోజు ఇంత మంచి క్లాసు మిస్ అయ్యారని బాధగా ఉంది" రామ్‌దేవ్ గారన్నారు.

"జితేంద్రగారు చాలా సబ్జెక్టు ఉన్నవారు. వారు అడిగే ప్రశ్నలు కూడా అసందర్భమైనవి కావని మా అభిప్రాయం" రాజీవ్ అన్నాడు.

"నిజమే. కొన్నిసార్లు ఆచార్యుల స్థానంలో ఉన్నవారి కంటే శిష్యస్థానంలో ఉన్న ఏ ఒక్కరికో ఎక్కువ తెలిసి ఉండవచ్చు. కానీ మనం గౌరవించవలసినది ఆచార్య స్థానాన్ని" రామ్‌దేవ్ అన్నాడు.

"ప్రశ్నించే హక్కు శిష్యస్థానానికుంది" కృష్ణ అన్నాడు.

"ఉంది కానీ మేము ఆహ్వానించిన వ్యక్తికి గౌరవభంగం కానివ్వకుండా చూడటం మా విధి"

"అలాగే కానివ్వండి. మేము కూడా బుద్ధిగా విధిగా వింటూ మా శిష్యస్థానానికి న్యాయం చేకూరుస్తాం"

"మీతోటి అధ్యాపకుడి గురించి మీరింతగా స్పందించడం నాకానందాన్నిస్తోంది. కానీ మీకో సంగతి చెప్పాలి. నేను భోజనానికి టైము లేక రాత్రి భోంచెయ్యలేదు. పని పూర్తి అయ్యేటప్పటికి రాత్రి ఒంటిగంటయ్యింది. పొద్దున ఇక్కడికి వచ్చి అటెండర్‌కి టిఫెను తెమ్మని చెప్పి క్లాసుకు వచ్చాను. క్లాసులో జితేంద్రగారు లేకపోవడం, వారు నిన్న నా ఆర్గ్యుమెంట్ మూలంగా మానేసారేమోననే అనుమానం వల్ల కలిగిన బాధతో ఏమీ తినలేకపోయాను. ఇంతమందిలో స్పందన ఒక్కసారిగా పోతే ఇక మానసికంగా నేనెంత కుంగిపోతానో మీరూహించండి. విజ్ఞత చూపించండి" అంటూ బోర్డువైపు తిరిగి మరుసటి రోజు వచ్చే ఆచార్యుల వారు బోధించే టాపిక్ రాసారు రామదేవ్.

"ఎక్స్‌క్యూజ్ మీ సర్"

రామ్‌దేవ్‌తో సహా అందరూ క్లాసురూం డోర్ వైపు తిరిగిచూసారు.

గుమ్మం దగ్గర జితేంద్ర నిల్చుని ఉన్నాడు.

నిశ్శబ్దం.

జితేంద్ర ఏదో చెప్పాలని ఎదురుచూస్తున్నారంతా.

"క్షమించండి. స్టేషనుకు వెళ్ళాను. కానీ ట్రైను ఎక్కలేకపోయాను. వాదనకి దారితీసేటట్లు ప్రవర్తించడంలో తప్పుచేసానేమోనని మానసికంగా నలిగి వెనక్కి తిరిగివచ్చేసాను. ఇలా తిరిగిరావడంతో ఆత్మాభిమానాన్ని తగ్గించుకుంటున్నానేమోనని మథనపడిన మాట నిజం. కానీ గుమ్మంలోకి అడుగుపెడుతుంటే రామ్‌దేవ్‌గారి మాటలు వినిపించాయి. వాదం చేయవచ్చుకానీ వివాదానికి దోవతీయడంలో ఎంతమంది హృదయాల్ని గాయపరుస్తున్నామో తెలుసుకున్నాను."

"డియర్ ఫ్రెండ్స్, ఈ సందర్భాన్ని సెలబ్రేట్ చేసుకుందాం. ఆకలిగా ఉంది. రండి కలిసి భోజనం చేద్దాం!" రామదేవ్‌గారి చివరిమాటలు అభ్యర్థుల హర్షధ్వానాలతో కలిసిపోయాయి.

మనస్సుల్లో మబ్బులు తొలగిన అనుభూతి కలిగిందందరికీనూ!